www.prajasakti.com

ప్రజాశక్తి

5

సోమవారం 15 మే 2023



'పుచ్చలపల్లి' వర్ధంతి సభను జయప్రదం చేయాలి

కడప అర్బన్ : ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 1985, మే 19న మరణించారని, ఆయన వర్ధంతి సభను ఈనెల 19న కడప నగరంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు నగర కమిటీ సభ్యులు డి. ఎం.ఓబులేసు తెలిపారు. ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య మరణించి 38 సంవత్సరాలు గడిచిన ఆయన ఆచరించిన సిద్ధాంతం, విలువలు నేటికీ ఆదర్శప్రాయమన్నారు. సమాజంలో రోజురోజుకూ మార్పులు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సుందరయ్య చేసిన త్యాగాలు, ఆచరించిన విలువలు భావితరాలు ఆదర్శప్రాయంగా తీసుకోవాలన్నారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు పాత బస్టాండులోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభను నిర్వహిస్తున్నామన్నారు. సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మల్బరీతో అధిక ఆదాయం

- ఎకరాకు రూ.2 లక్షలపైనే
- కుటీర పరిశ్రమ తరహాలో సాగు చేయాలి
- ఏటా ఐదు దశల్లో రాబడి
- జిల్లా పట్టు పరిశ్రమశాఖ ఎడి శ్రీనివాసులరెడ్డి వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడపప్రతినిధి

మల్బరీ సాగుతో అధిక ఆదాయం లభ్యమవుతుంది. కుటీర పరిశ్రమ తరహాగా భావించి సాగు చేస్తే మరింత ఆదాయం లభిస్తుంది. దీనికి సమగ్ర యాజమాన్య పద్ధతులను జోడించాలి. దీనికితోడు జబీవలి నూతన రకాలు వంగడాలతో పంటలను సాగు చేసుకోవాలి. ఆధునిక మార్కెటింగ్ సదుపాయం కారణంగా గణనీయంగా ఆదాయం లభిస్తోంది. సరుకును తూకం వేసిన వెంటనే పేమెంట్ చెల్లింపుల వ్యవస్థ ఏర్పాటైంది. స్వల్ప కాలిక పంటల తరహాలో 45 రోజుల నుంచి 70 రోజుల వ్యవధిలో ఆదాయం లభిస్తోంది. తెగుళ్ల సోకే అవకాశం ఉండదు. వాణిజ్య పంటల తరహాలో లక్షలాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయే అవకాశం ఉండదని పేర్కొంటున్న కడప పట్టు పరిశ్రమశాఖ ఎడి శ్రీనివాసులరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

మల్బరీ వివరాలు తెలపండి ?

జిల్లాలో 825 ఎకరాల్లో మల్బరీ సాగులో చేయాల్సి ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సర చివరి నాటికి 250 ఎకరాల లక్ష్యానికిగాను 222 ఎకరాల్లో సాగు చేయడమైంది. దీంతో 89.15 శాతం లక్ష్యాన్ని అందుకోవడమైంది. జిల్లావ్యాప్తంగా 350 మంది రైతులకు రూ.269 కోట్ల మేరకు ఆదాయం లభించింది.

మల్బరీ ఫామ్‌లెన్ని?

రెండు మల్బరీ ఫామ్స్ ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంట, కడప నగర సమీపంలోని ఊటుకూరు ప్రాంతాల్లో పెంచుతున్నాం. రెండు లక్షల మల్బరీ నారు మొక్కలను పెంచి రైతులకు సరసమైన ధరకు అందుబాటులో ఉంచుతున్నాం. రూ.2 చొప్పున నర్సరీ మొక్కలను అందజేస్తాం.

ప్రోత్సాహకాల వివరాలు తెలపండి?

ఎకరా నారు మొక్కలకు రూ.18,500 ఇస్తాం. షెడ్డు నిర్మాణానికి రూ.3.35 లక్షలు, ఎస్సి, ఎస్‌టిలకు నాలుగు లక్షలు కేటాయిస్తున్నాం. పరికరాలు, స్టాండ్, ప్లాస్టిక్ ట్రేలు, నేత్రికలు (చంద్రికలు) నిమిత్తం రూ.75,000 మంజూరవుతుంది. ఇందులో ఎస్సి, ఎస్‌టిలకు 90 శాతం, ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ అందజేస్తాం.

మల్బరీ విస్తరణ చర్యలేమిటి?

ఊటుకూరు, వనిపెంట ప్రాంతాల్లో మల్బరీ సాగు పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ సబ్సిడీలు, సాగు లాభదాయకతను వివరించడం జరుగుతోంది. దీంతోపాటు వనిపెంటలో జాకీ పురుగుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా అభ్యుదయ రైతు లను ఆకర్షిస్తున్నాం. ఫలితంగా మల్బరీ సాగు విస్తీర్ణాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం.

గూళ్ల రకాలెన్ని, ఇన్సెంటివ్ వివరాలు?

బైవల్టీన్, సి.బి రకాలు. తెల్లగూళ్లు, ఏప్రిల్, మే, జూన్‌లో సాగు చేసుకోవచ్చు. సిబి గూళ్లు, తెల్లగూళ్లకు మార్కెట్లో కిలో రూ.750, సిబి గూళ్లకు రూ.400 ఇన్సెంటివ్ కింద వచ్చే అవకాశం ఉంది. రైతులే గూళ్లను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలి. గూళ్ల కొనుగోలు అనంతరం నగదును చెక్కుల రూపంలో అందజేస్తారు.

మార్కెట్ల వివరాలు తెలపండి?

కదిరి, ధర్మవరం, పలమనేరు, హిందూపురం మార్కెట్లలో విక్రయించుకునే అవకాశం ఉంది. కర్నాటకలో రాంనగర్, సిద్ధలగట్ట మార్కెట్లు అందుబాటులో ఉన్నాయి.

సాగు సీజన్ల గురించి చెప్పండి?

జూన్ నుంచి మార్చి వరకు మల్బరీని సాగు చేసుకోవచ్చు. సిబి రకం, బైవోల్ట్ రకం. సిబి రకం వేడి వాతావరణంలో సాగు చేసుకోవచ్చు. బైవోల్ట్ రకం చేపవిలో సాగు చేసుకోవాలి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బైవోల్ట్ సీడ్, మార్చి నుంచి జూన్ వరకు సిబి రకం రకాలను సాగు చేసుకోవాలి.

మల్బరీ దశలను వివరించండి?

నాలుగు జరాలు, ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పురుగు బయటికి వచ్చేది మొదటి దశ, మూడు రోజుల తర్వాత జరానికి పోవడం జరుగుతుంది. 24 రోజుల్లో పురుగు రూపంలో లార్వా దశ వస్తుంది. ఆరు నుంచి ఎనిమిది రోజుల తరువాత గూడు కట్టుకోవడాన్ని పీపా దశ అంటారు. ఐదవ రోజు మార్కెట్ పోవడం జరుగుతుంది. ఐదో రోజు మార్కెట్ తీసుకెళ్లి ఇ-యాక్షన్ ద్వారా రీలర్స్‌కు విక్రయించాలి. రేటు ఇష్టం లేక పోతే సెకండ్, థర్డ్ యాక్షన్లకు వెళ్లొచ్చు. విక్రయ అనంతరం గంట తర్వాత రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

షెడ్ల ఏర్పాటు, సంరక్షణ ఎలా ?

ఊరు బయట, పొలాల్లో షెడ్డు ఏర్పాటు చేయాలి. 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 35 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో షెడ్డు నిర్మించాల్సి ఉంది. యూనిట్ విలువ రూ.4 లక్షలు అయితే ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ, ఎస్సి, ఎస్‌టి 90 శాతం సబ్సిడీ ఇస్తారు. రూ.3.60 లక్షలు వస్తుంది. షెడ్ల అడుగు భాగంలో న్యూస్ పేపర్ వరి బి షూట్ ఫీడింగ్ (కొమ్మలు వేయడం) చేయాలి. నేత్రికలు, చాకీ కట్టెలు ఏర్పాటు చేయాలి. సున్నం కొట్టడంతో క్రిమి కీటకాదులు నశించి పోవడంతో తెగులు అనేది ఉండదు. ఫలితంగా లేబర్ ఛార్జీ తగ్గుతుంది. కొమ్మ అధిక సమయం ఫ్రెష్‌గా ఉంటుంది.

సాగు తీరుతెన్నుల గురించి తెలపండి?

మొక్కల మధ్య మూడు అడుగుల వ్యత్యాసం ఉండాలి. గాలి పారడంతో ఆకులు పండుబడకుండా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా తోట ఆరోగ్యవంతంగా ఉంటుంది. జిల్లాలో కడప, బద్వేల్, పులివెందుల, మైదుకూరు ప్రాంతాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉంది.

పంట దశలను వివరించండి?

మూడు నెలల పాటు నారు సాగు చేయాల్సి ఉంటుంది. నాలుగున్నర నెలకు కోత దశకు చేరుకుంటుంది. ప్రతి 45 రోజులకోసారి పంట కోతకు వస్తుంది. ఈలెక్కన ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు తీసే అవకాశం ఉంది. దీంతో ఎకరా సాగుకు 250 నుంచి 300 గుళ్ల మేపవచ్చు. కోతకు రూ.90 వేల చొప్పున ఆరు కోతల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. ఈలెక్కన ఎకరానికి రూ.రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

మైలవరానికి మరమ్మతులేవి?



మైలవరం రిజర్వాయర్ మరమ్మతులకు మరింత నిరీక్షణ తప్పడం లేదు. గతేడాది ఆగస్టులో జిల్లా నీటిపారుదలశాఖ రూ.80 కోట్లతో ప్రతి పాదనలు అందజేసింది. రాష్ట్ర ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగం రిమార్క్స్ పేరిట వెనక్కి పంపించింది. దీంతో జిల్లా నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రిమార్క్స్‌ను సవరించి మళ్లీ ప్రతిపాదనల్ని పంపించింది. ఇయినప్పటికీ తొమ్మిది నెలలుగా పాలనామోదానికి నిరీక్షించాల్సి వస్తోంది. పాలనామోదం అనంతరం సాంకేతిక అనుమతులు, టెండర్లు, అగ్రిమెంట్ల వ్యవహారం పూర్తి చేసే సమయానికి పుణ్యకాలం ముగియనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈలోపు 2024 సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడే అవకాశాలు నేపథ్యంలో మైలవరం మరమ్మతులు ఇప్పట్లో నోచుకునే అవకాశాలు లేవని తెలుస్తోంది.

- తొమ్మిది నెలలుగా 'రిమార్క్స్'
- రాష్ట్ర టెక్నికల్ విభాగం మోకాలడ్డు
- కాగితాల్లోనే రూ.80 కోట్ల ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలోని భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకటైన మైలవరం మరమ్మతులకు గురైంది. రాయలసీమకే తలమానికమైన గండికోట రిజర్వాయర్‌కు అనుసంధానమై ఉంది. 9.99 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో కూడిన 74 వేల ఎకరాల ఆయకట్టును కలిగి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు మరమ్మతులకు రూ.80 కోట్లతో కూడిన ప్రతిపాదనలు నెలల తరబడి ఆమో దానికి నోచుకోవడం లేదు. గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా మైలవరం రిజ ర్వాయర్ రివిట్‌మెంట్ దెబ్బతింది. దీంతోపాటు రిజర్వాయర్ బ్యూటిఫికేషన్ నిమిత్తం పంపించిన ప్రతిపాదనలు రిమార్క్స్ పేరిట పాలనా యంత్రాంగం వెనక్కి పంపించింది. దీంతో జిల్లా నీటిపారుదలశాఖ రిమార్క్స్‌ను సవరించిన ప్రతిపాదనల్ని మళ్లీ పంపించింది. నెలల తరబడి ఎటువంటి కదలిక లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

మైలవరానికి చేపట్టాల్సిన మరమ్మతులివే!

మైలవరం రిజర్వాయర్‌కు రివిట్‌మెంట్ దగ్గర నుంచి గేట్లు, గోడలు, గేట్లు, కట్ట, లెఫ్ట్ బ్యాంక్, ప్రొటెక్షన్‌వాల్, ఫ్లడ్‌గేట్, లైటింగ్, రహదారి, గేట్లు, ఉత్తర, దక్షిణ కాల్వల మొదలగు నిర్మాణ పనులు దెబ్బతిని శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. గతేడాది లెఫ్ట్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు, ఈదర మొక్కలను తొలగించారు. మళ్లీ యథాతథ పరిస్థితులు నెల కొనడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్పందించి జిల్లా నీటి పారుదలశాఖ సహకారంతో రూ.80 కోట్లతో ప్రతిపాదనలను అందజేశారు. ఆమేరకు పాలనాపరమైన ఆమోదం లభించగలదేమనని భావించింది. ఎస్‌సిఎల్‌టి విభాగానికి ఫైలు చేరుకున్నట్లు ప్రచారం సాగింది. ఇక్కడ అనుమతి లభించకపోవడంతో రిమార్క్స్ పేరిట వెనక్కి పంపించింది. దీంతో జిల్లా నీటిపారుదలశాఖ ఆఘమేఘాల పడి రిమార్క్స్‌ను సవరించి తిరిగి ప్రతిపాదనలు పంపించింది.

తొమ్మిది నెలలుగా నిరీక్షణే

తొమ్మిది నెలలుగా అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతుల కోసం జిల్లా నీటిపారుదలశాఖ నిరీక్షిస్తోంది. రాష్ట్రిరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం రిమార్క్స్ పేరిట అనుమతులు ఇవ్వడంలో కాలయాపన చేస్తోంది. ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన భారీ ప్రాజెక్టు పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన మధ్య తరహా, చిన్న తరహా ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే. రాబోయే నెల నుంచి వర్షాకాల సీజన్ మొదలు కానుంది. సహజంగా ఆగష్టు, అక్టోబర్, నవంబర్ మాసాల్లో వరదలు పోటెత్తితే మైలవరం ప్రాజెక్టు పరిస్థితేమిటో తెలియడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర నీటిపారుదలశాఖ స్పందించి మైలవరం సాగునీటి ప్రాజెక్టు మరమ్మతుల పనుల్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన డంలో సందేహం లేదు.

వామపక్షాలతోనే దేశాభివృద్ధి సాధ్యం

-సీనియర్ వామపక్ష నాయకులు



ఆత్మీయ సమావేశంలో సీనియర్ వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వామపక్షాలతోనే దేశాభివృద్ధి సాధ్యమని సీనియర్ వామపక్ష నాయకులు ఉద్ఘాటించారు. ఆదివారం హేతు వాద సంఘం, కార్మిక సంఘం నాయకులు సిఆర్వీ ప్రసాద్, డబ్బూ రాము ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఐఎంఎ ఫంక్షన్ హాల్‌లో వామపక్ష పార్టీల సీనియర్ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో పలువురు పాతతరం ఉద్యమ నేతలు హాజరై మాట్లాడారు. గతంలో వారు చేసిన ఉద్యమాలు ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్య పరిచి వామ పక్ష భావాలను ప్రజల ముందుకు తీసుకు వెళ్ళాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశంలో నేటి సామాజిక, రాజకీయ పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడు కోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సిఆర్వీ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాలు స్తబ్దతగా ఉన్న నేపథ్యంలో మరోసారి ఎర్రజెండాతో ఆకిందంగా ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు అందరిని సమాయత్తం చేయాలని ఆలోచనతో ఈ సమావేశం నిర్వహించామని చెప్పారు. పాతతరం నేతల ఉద్యమ నేపథ్యాన్ని దష్టిలో ఉంచుకుని వారి సలహాలు, సూచనలతో ముందుకెళ్లేందుకు శ్రీ కారం చుట్టామని తెలిపారు. అనంతరం నాటి పాతతరం నాయకులు పుల్లారెడ్డి, వెంకటాద్రి, లింగమూర్తి, శివాజీ, చెన్నకేశవ రెడ్డిని సన్మానం చేశారు. సమావేశంలో రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్, జైలు సూపరింటెండెంట్ ఫణి రాజు, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ రామ్ గోపాల్, డాక్టర్ ఓబుల్ రెడ్డి, సీనియర్ నాయకులు మామిడి మురళీ మోహన్, ప్రసాద్ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, వారాధి జోసెఫ్, సావంత్ సుధాకర్, బి.నారాయణ, భగవాన్ రెడ్డి, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, జి.చంద్ర శేఖర్, భాస్కర్, నగర కార్యదర్శులు వెంకట శివ, రామమోహన్, జిల్లా నాయకులు దస్తగిరిరెడ్డి, మద్దిలేటి, గంగా సురేష్, మనోహర్ రెడ్డి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వామపక్ష నేతలు పాల్గొన్నారు.

కర్ణాటక ప్రజాతీర్పు బిజెపికి గుణపాఠం

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బిజెపి నిరంకుశ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పు గుణపాఠంగా తీసుకుని మన రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు అవకాశవాదంతో బిజెపితో అంట కాగడం మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ మత రాజకీయాలకు చెంప పెట్టని, ప్రజా స్వామ్యం, రాజ్యాంగ విలువలు గెలవాలని తెలిపారు. రాజ్యాంగ సూత్రాలను ధిక్కరిస్తూ క్రోనీ క్యాపిటల్ లిస్ట్ పద్ధతిలో ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్న ప్రధాని మోడీని గద్దె దించుకు సాగుతున్న పోరాటంలో విజయం సాధించిన కర్ణాటక ప్రజలకు అభినందనలు తెలిపారు. బిజెపి మత రాష్ట్రానికి ఈరని ప్రచారం చేసిందని, ముఖ్యంగా ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాల అభి వద్ధికి ప్రత్యేక నిధులు, విశాఖ ఉక్కు ప్యాక్టరీని ప్రయివేటుకు దారదత్తం చేసే దిశగా ముందుకు వెళుతుందని, విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు, ఆస్తుల పంపకాలను పరిష్కరించకుండా అన్యాయం చేస్తు ందన్నారు. మోడీని ప్రసన్నం చేసుకోవడానికి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడు తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ దాడులకు భయపడి ఏం చెప్పి నా తాళం వేస్తున్నాయని ఎద్దేవ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ మత ఘర్ష ణలు సష్టించడానికి ప్రయత్నిస్తున్న బిజెపి ఆయా పార్టీల నాయకులు మద్దతిస్తున్నారని విమర్శించారు. బిజెపి చేస్తున్న మోసాన్ని, రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని రానున్న ఎన్నికల్లో నిలదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామమోహన్, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

స్థానిక గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు భాసీంవల్లి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ నచ్చిన బొమ్మలను వేశారు. ఈ సందర్భంగా భాసీం వల్లి మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. జూనియర్, సీనియర్ విభాగాలలో విజేతలైన వారికి బంగారం బహుమతులు అందజేస్తామన్నారు. డ్రాయింగ్ పోటీలలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహు బుతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అఫీద్, జనవిజ్ఞాన వేదిక నాయకులు దాదాపీర్, పాతకులు ప్రకాష్, ఖదీర్, సుబ్రమణ్యం, నరసింహ పాల్గొన్నారు.

పిఆర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాజేష్

పోరుమామిళ్ల టౌన్ : పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం, రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక శనివారం గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో నిర్వహించారు. ఈ ఎన్నికలలో కడప జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా నాగదాసరి రాజేష్ ప్రభు కుమార్‌ను పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం రాజేష్ బేకూర్‌పేట హైస్కూలులో నాన్ టీచింగ్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి : డివైఎఫ్ఐ

బద్వేలు : కొద్ది రోజులుగా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ భూషణ్‌ను అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బద్వేల్ పట్టణంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశానుదేశించి ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలాగా రెజ్లర్ మహిళా క్రీడాకారులు బంగారు, కాంస్య పతకాలను ఒలంపిక్ టోర్నీ ఒలంపిక్‌లో సాధిస్తున్న వారికి అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధిం పులకు పాల్పడం దారుణమని వాపోయారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారి పైన వెంటనే కఠిన చర్య తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరిలో ఆందోళనకు దిగితే ప్రభుత్వం కమిటీ వేసి విచారిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలైనా పట్టించుకోకపోవడంతో కొద్ది రోజుల కిందట ఏడుగురు మహిళా రెజ్లర్ క్రీడాకారులు సుప్రీంకోర్టును ఆశ్రయం చారని చెప్పారు. కోర్టు సైతం ఇది తీవ్రమైన ఆరోపణ తక్షణమే ఢిల్లీ పోలీసులు స్పందించి చర్య తీసుకోవాలని ఆదేశించిందని చెప్పారు. తక్షణమే మోడీ ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా డివైఎఫ్ఐ , విద్యార్థి యువజన సంఘాలను ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఎ తను ఆందోళన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు గంగనపల్లి నాగార్జున మహిళా కన్వీనర్ గురుదేవి పాల్గొన్నారు.

మంత్లీ రోలింగ్ చెస్ ట్రోఫీ విజేతగా లిఖిత్

ప్రజాశక్తి - కడప



విజేతలకు బహుమతులను ప్రదానంచేస్తున్న కోచ్

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 16వ ఆస్ఫా ప్రసన్న మంత్లీ రోలింగ్ చెస్ టోర్నమెంట్ ట్రోఫీ విజేతగా ఇటీవలే ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ సాధించిన రేటెడ్ చెస్ క్రీడాకారుడు లిఖిత్ నిలిచాడు. ఐదు రౌండ్లకు గాను 4.5 పాయింట్లు సాధించి ట్రోఫీ విజేతగా లిఖిత్ నిలిచాడు. రెండవ స్థానాన్ని మరో రేటెడ్ క్రీడాకారుడు ప్రణవ్‌దేవ దక్కించుకున్నాడు. మూడవ స్థానంలో రేటెడ్ క్రీడాకారుడు వినీల్ నిలిచాడు. 4 నుంచి 10 స్థానాలలో ప్రదీప్ చంద్ర, ప్రణీత్, సాకేత్, పృథ్వి, అభిరామ్, యాషిదా, అశుతోష్ నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా నలుమూలల నుంచి 26 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్లుగా టోర్నమెంటును చీఫ్ ఆర్బిటర్ బి. శ్రీకాంత్ నిర్వహించారు. జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనపరిచారని అసోసియేషన్ కార్యదర్శి అనీష్ దర్భారి తెలిపారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అనీష్ దర్బారి, చెస్ కోచ్ తబస్సుమ్, చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్ చేతుల మీదుగా అందజేశారు.

ఆలయంలో అన్నదానం

చెన్నూరు : హనుమాన్ జయంతి సందర్భంగా కడప- కర్నూల్ జాతీయ రహదారి సమీపంలో బుడ్డాయపల్లి వద్ద వెలసిన శ్రీ అంజనేయ స్వామి ఆలయంలో, చెన్నూర్ లోని బ్రాహ్మణ బ్రాహ్మణవీధిలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. **పోరుమామిళ్ల టౌన్ :** హనుమాన్ జయంతి సందర్భంగా పోరుమామిళ్ల బలిజపేట వీధిలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామిని తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, తన సోదరుడు సూరిబాబుతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేసుల పరిష్కారంలో జిల్లాకు ఐదో స్థానం

కడప : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్రంలోనే కేసుల పరిష్కారంలో కడప జిల్లా ఐదవ స్థానంలో నిలిచినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ తెలిపారు. ఆదివారం వారు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం అయిన కేసుల వివరాలు మీడియాకు విడుదల చేశారు. జాతీయ లోక్ అదాలత్ లో జిల్లావ్యాప్తంగా 10486 క్రిమినల్ కేసులు, 243 సివిల్ కేసులు, 2168 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు. ఇందులో కడప కోర్టులో 917 కేసులు, ప్రొద్దుటూరు కోర్టులో 917 కేసులు, రాజంపేట కోర్టులో 671 కేసులు, రాయచోటి కోర్టు లో 771 కేసులు, బద్వేల్ కోర్టులో 2357 కేసులు, లక్కిరెడ్డిపల్లె కోర్టులో 246 కేసులు, రైల్వే కోడూరు కోర్టులో 221 కేసులు, సిద్ధవటం కోర్టు లో 530 కేసులు, సిద్ధవటం కోర్టు లో 188 కేసులు, జమ్మలమడుగు కోర్టులో 1151 కేసులు, పులివెందుల కోర్టు లో 348 కేసులు కమలాపురం కోర్టులో 302 కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసి, జిల్లాను 5వ స్థానంలో నిలిపినందుకు సంబంధిత గాను ఈ సందర్భంగా అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. **పుష్పగిరిలో జడ్జి ప్రత్యేక పూజలు ..**

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరిలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో జిల్లా జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుల్లో నూతన ఉత్సాహం

కాశినాయన : రైతుల్లో ఆనందాన్ని ఉత్సాహాన్ని పెంచేలా ఎడ్ల బండలాగుడు పోటీలు నిలిచాయని బద్వేల్ తెలుగుదేశం పార్టీ నాయకులు కర్నాటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉప్పలూరులో హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవంలో భాగంగా ఎద్ద బండ్ల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమం అంతా రసవత్తరంగా సాగడంతో ప్రజలు ఉత్సాహం చూపడం విశేషం.

బిసిల ద్రోహి వైసిపి

కడప అర్బన్ : బిసిల ద్రోహి వైసిపి ప్రభుత్వమని టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు మేకల బాలు అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి ఇచ్చిన తరువాత 26 మంది బిసిలకు పొట్టనపెట్టుకుందని విమర్శించారు. సిఎం పదవి నుంచి జగన్ మోహన్‌రెడ్డిని గద్దెదించే పని బిసిలదే అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, హరి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో బిసిలు బ్యాక్ బోన్ అని ఇప్పుడు వెన్ను విరిచేస్తున్నారని విమర్శించారు. టిడిపి సబ్‌ప్లాన్ కింద పనిముట్లు ఇచ్చేదని, జగన్ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని తెలిపారు. 58 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు లేకుండా చేశారని చెప్పారు. బిసి నిధులు నవరత్నాలకు మళ్లించారని విమర్శించారు.

భవానీ నగర్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి- కడప అర్బన్



భవానీ నగర్‌లో పర్యటిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

భవానీ నగర్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి. ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షం పడినా మోకాలు లోతు నీళ్లు నిలబడి ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నికైన 40వ డివిజన్ కార్పొరేటర్ పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఆదివారం భవానీ నగర్ రోడ్డును డివైఎఫ్ఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ 18 ఏళ్లుగా 40వ డివిజన్ పరిధిలోని భవానీ నగర్ రోడ్డు సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అనేక మంది చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేటర్‌కు అనేకసార్లు స్థానిక ప్రజలు విన్నవించినా ప్రయోజనం శూన్యమన్నారు. చుట్టుపు చూపుగా కూడా ప్రాంతాన్ని పర్యటించి పరిస్థితి చేదని ఉదేవలు వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు చేస్తామని హామీ ఇచ్చి పేదలను అమలు చేయలేదని విమర్శించారు. తక్షణమే రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజానికాన్ని కలుపుకుని ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు అఫ్సర్, జహీద్, నవీన్, కిషోర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని ఆదివారం 104 సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. నాగార్జున రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. 104 రాష్ట్ర యూనియన్ కార్యదర్శులతో భాగంగా పోరుమామిళ్లలో ప్రజా ప్రతినిధి నాగార్జున రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డ్రైవర్ శ్రీరాములు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు గురప్ప, మహబూబ్ బాషా, పాల్గొన్నారు.

డిఎస్‌పిని కలిసిన బండి సుమంత్ కుమార్

ప్రజాశక్తి - కడప



డిఎస్‌పి తో అందజేస్తున్న సుమంత్‌కుమార్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కడప డిఎస్‌పి ఎం.డి. షరీఫ్‌ను యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్, ఎన్ఎస్‌యు సభ్యులు బండి జకరయ్య ఆదివారం డిఎస్‌పి కార్యాలయంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూలబోకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వంశీ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి బొజ్జ తిరుమలేష్, కాంగ్రెస్ కార్యకర్త రత్నకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

ప్రజాశక్తి - వేంపల్లె

చక్రాయపేట మండలం గండి క్షేత్రంలో ఆదివారం హను మజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ శోభ యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ హనుమంతుడు విశ్వాసానికి, నమ్మకానికి ప్రతీక అన్నారు. బుద్ధి బలం, శారీరక బలానికి ప్రతి రూపమని తెలిపారు. హనుమంతుడు కార్య సాధకుడని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారి ముకుందరెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు రామాంజనేయురెడ్డి, మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, యోగీశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, తేజా, రామచంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కేసరిస్వామి, ఉత్తన్న, నాయకులు పాల్గొన్నారు.



శోభ యాత్రలో పాల్గొన్న తులసిరెడ్డి

ఉత్సాహభరితంగా బండలాగుడు పోటీలు

ఖాజీపేట : మండలంలోని తవ్వారుపల్లె గ్రామంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం వీరాంజనేయ స్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతో, దాతల చేయూతతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సందుల నాగేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.



కార్యక్రమంలో పుట్టా సుధాకర్ యాదవ్

చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో వీరాంజనేయ స్వామి జయంతి ఉత్సవ కార్యక్రమాలను ఆదివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం ఏర్పాటు చేశారు. రాత్రి అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వనాథపురంలో సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిప్పిరెడ్డిపల్లెలో హనుమజ్జయంతి సందర్భంగా కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, చెక్కభజన వంటి సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.



కట్టా నరసింహులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ ప్రతినిధులు

సాహిత్యం, చరిత్ర రంగాల్లో 'కట్టా' కృషి మరువలేనిది

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో సాహిత్య, చరిత్ర రంగాల్లో విద్వాన్ కట్టా నరసింహులు కృషిని మరువలేమని యోగి వేమన విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం సమన్వయకర్త డాక్టర్ కోట మృత్యుంజయరావు కొనియాడారు. కైఫీయత్తుల పరిష్కర్త, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం తొలి బాధ్యులు కట్టా నరసింహులు రెండవ వర్ధంతిని ఆదివారం కడప నగరంలోని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా మృత్యుంజయరావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన సాహిత్య చరిత్రను వెలికి తీయడంలో కట్టా కృషి మరువలేమన్నారు. అనితర సాధ్యమనిపించే కైఫీయత్తుల పరిష్కారం ద్వారా జిల్లాలోని పలువురు మొన్నటితరం కవులు, వారి రచనలు, ఇతర ముఖ్యమైన ఎన్నో చారిత్రక అంశాలను ఆయన నేటి తరానికి అందించారన్నారు. ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయంతోపాటు ఇతర సాహిత్య కార్యక్రమాలతో అనుబంధం ఏర్పడడానికి విద్వాన్ కట్టానే కారణమన్నారు. రాయలసీమ టూరిజం సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దనరాజు మాట్లాడుతూ తనకు సాహిత్యంపై మక్కువ కలగడానికి విద్వాన్ కట్టాయే కారణమని, ఆయన ప్రోత్సాహం, శిక్షణతోనే కైఫీయత్తులను నేటి తరానికి అర్థమయ్యేలా పుస్తక రూపం ఇవ్వగలిగామన్నారు. ఆయన తనలాంటి ఎందరో వ్యక్తుల ప్రతిభను గుర్తించి సమాజానికి పరిచయం చేశారన్నారు. కట్టా బహుముఖ ప్రజ్ఞ గురించి ప్రముఖ టూరిజం ఫోటో గ్రాఫర్ గొబ్బూరు కోటేశ్వరరావు, గంగాధర్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విజయ్, నారు నాగరాజు, డేవిడ్, సతీష్ పాల్గొన్నారు.

సృష్టికి మూలం అమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

సృష్టికి మూలం అమ్మ అని క్యాపిటల్ చర్చి ఫాదర్ బిరుసు రాజా అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాథడల్ చర్చిలో మాతృ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టిలో అమ్మ అనే పదం చాలా గొప్పదన్నారు. అమ్మకు మించిన దైవం లేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తల్లిని ఆరాధించాలని చెప్పారు. అమ్మ ప్రేమ వెలకట్టలేమని పేర్కొన్నారు. పాస్టర్ చంద్ర మాట్లాడుతూ అమ్మ రుణం తీర్చుకోలేమన్నారు. ఎల్లవేళల రుణపడి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కన్య స్త్రీలు, ఉపదేశీలు, ప్రజలు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న మహిళలు

ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం

కడప అర్బన్ : చుక్కల భములపై ప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకమని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు దేవర శ్రీకృష్ణ అన్నారు. ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెవెన్యూ విభాగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పు అన్నారు. జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, లేకపోతే రైతులు మరల లంచాలతో దళారుల చేతిలో నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు.

పాదయాత్ర విజయవంతం చేయాలి

కడప అర్బన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నగరంలో నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఆదేశాల మేరకు పాదయాత్ర చేస్తామని తెలిపారు. కడప నియోజకవర్గ, నగర అధ్యక్షుల సారథ్యంలో కలిసికట్టుగా ముందుకు వెళతామని చెప్పారు. సమావేశంలో బిసి సెల్ ఉపాధ్యక్షులు నాదెల దస్తగిరి, కార్యదర్శి శ్రీనివాసులు, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్, డివిజన్ ఇన్‌ఛార్జీలు బండి జయశేఖర్, జనార్దన్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల నేస్తం.. స్నేహిత అమృత హస్తం



శిక్షణనిస్తున్న ఉపాధ్యాయులు



గ్రూప్‌గా చదువుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

14 ఏళ్ల నుంచి పేద విద్యార్థులకు ఆసరాగా స్నేహిత అమృతహస్తం సేవా సమితి నిలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేయడంతోపాటు వారిని చైతన్యవంతులను చేస్తోంది. గతంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్, ఐటిఐ కోర్సుల్లో చేరేందుకు మక్కువ చూపేవారు. సాంకేతిక విద్య అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వాలు కూడా కృషి చేశాయి. ఈ క్రమంలో పాలీసెట్, ఎపి ఆర్‌జెసి వంటి ప్రవేశ పరీక్షలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలను ఎదుర్కోవాలంటే వ్యయ ప్రయాసాలకోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. అయితే 37 మంది ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పులివెందుల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎలాంటి వ్యయ్య ప్రయాస లేకుండా పోయింది. ఇంతింతై వటుడింతై అన్న చందంగా దినదినాభివృద్ధి చెందుతూ వేలాది మంది పేద విద్యార్థులకు స్నేహిత అమృత హస్తం సేవా సమితి అండగా నిలుస్తోంది. ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో పైసా ఖర్చు లేకుండా ఉచితంగా కోచింగ్ అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతోంది. లింగాల మండలం కామసముద్రం గ్రామానికి చెందిన మొమ్మెల రాజు పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రిలోని రక్తనిధి ల్యాబ్ టెక్నీషియన్. ఉద్యోగరీత్యా పులివెందులలో స్థిరపడ్డాడు. విద్యాపరంగా పేద విద్యార్థులకు ఏదైనా తన వంతు సాయం అందించాలనే ఆలోచన ఆయనలో మొదలైంది. ఆ మేరకు ఉపాధ్యాయులు, పాత్రికేయులు, పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావుల నుంచి సలహా తీసుకున్నారు. వీరందరూ కూడా ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం మంచిదే అనే అభిప్రాయానికి వచ్చారు. వెంటనే రాజు ఆశయం బలపడింది. క్రమేణా 2010లో కేవలం నలుగురు ఉపాధ్యాయులతో పాలీసెట్, ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలకు ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వేలాది మంది విద్యార్థులు ఉచిత కోచింగ్ సెంటర్ ద్వారా మంచి ర్యాంకులు సాధించడంతోపాటు ఉన్నతస్థాయిని అధిరోహించారు. ఉచిత కోచింగ్ సెంటర్ ద్వారా ఎంతో మంది ప్రయోజకులైన వారు కూడా ఉన్నారు. ఇలాగే ఇంకా పలువురు పేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తారని ఆశిద్దాం.

సామాజిక సేవ చేస్తూ ఉంటా..



ఈ ఏడాది ఉచిత కోచింగ్‌కు సంబంధించి స్థానికంగానే కాకుండా రాయల సీమ ప్రాంతం నుంచి కూడా విద్యార్థులు వచ్చారు. ప్రస్తుతం 280 మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ ద్వారా శిక్షణనిస్తున్నాం. పట్టణం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా సాంకేతిక విద్య అందించాలనే దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా నా వంతు కృషి చేస్తాను. ఈ ఆశయానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహకరించడం వారికి ఆజన్మాంతం రుణపడి ఉంటాను. ఊపిరి ఉన్నంతవరకు సామాజిక కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నాను. అందుకు ప్రజలు కూడా ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను.

- రాజు, స్నేహిత అమృతహస్తం సేవా సమితి

పూర్వ విద్యార్థుల కలయిక హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

చిన్న నాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధుర స్మృతులుగా నిలిచి పోతాయని విశ్రాంత ఉపాధ్యాయులు పుల్లారెడ్డి, ఆదినారాయణ, లక్ష్మి నారాయణలు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1980 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా బాలుర పాఠశాల ఆవరణలో ఒకేచోట కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి మరపురాని మధురమైన సంఘటనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు తమ పట్ల చూపిన అభిమానానికి పూర్వ విద్యార్థులు నమస్కార వదనంతో సంస్కారం మేళవించి ఘనంగా సత్కరించి గౌరవించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. దాదాపు 43 ఏళ్ల తర్వాత ఈ ఆత్మీయ సమ్మేళనం చేసుకోవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు. పూర్వ విద్యార్థులు నరసింహారెడ్డి, ఓబులేసు, సోమేశ్వరరెడ్డి, దేరంగుల రామాంజనేయులు, ఆదిరెడ్డి మాట్లాడారు.



విద్య నేర్పిన ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్న మిత్రులకు సహాయ సహకారాలను అందించాలని తీర్మానించారు. ఆత్మీయ సమ్మేళనంకు కృషి చేసిన నరసింహారెడ్డి, ఓబులేసులను స్నేహితులు సత్కరించారు.

అన్నదాతకు తొలకరి ముందస్తు పలకరింపు

- దుక్కులకు అనుకూలించిన వాతావరణం



సేద్యం చేస్తున్న రైతు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది వరుణుడు అన్నదాతను ముందే పలకరించాడు. నిశిరాత్రి వేళ నిండు వర్షం కురవడంతో దుక్కులకు వాతావరణం కూడా అనుకూలించింది. ఈ వేసవి కాలపు దిక్కులు రైతులకు బహుళ ప్రయోజనం కలిగిస్తాయి. సాధారణంగా మే 15 నుంచి రైతులు వ్యవసాయంపై దృష్టి సారిస్తారు. అప్పుడే ఏరువాక సేద్యాలకు రైతులు ఉపక్రమిస్తారు. కానీ ఈ దఫా ముందస్తుగా పదును వర్షాలు కురిశాయి. దుక్కులకు వాతావరణం అనుకూలించడంతో రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. ఏడాది పొడవునా సాగు చేసే పంటలకు వేసవి దుక్కులు ఎంతో ఉపయోగపడతాయి. ఖరీఫ్, రబీ రెండు సీజన్లు పూర్తయిన అనంతరం జనవరి లేదా ఫిబ్రవరి నుంచి రైతులు పంట విరామం పాటిస్తారు. తదుపరి సేద్యాల సమయం వచ్చేవరకు వేసవిలో ఎదురు చూస్తారు. తొలకరి లేదా ముంగారి చినుకుల ప్రభావం వేసవి కాలపు దుక్కులపై ఆధారపడి ఉంటాయి. ఉగాది పండుగ అనంతరం మొలకల పౌర్ణమి వస్తుంది. ఇక్కడి నుంచి వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు కూడా వ్యవసాయ పంటలకు మిక్కిలి దోహదపడతాయి. ఈ లోపు కాసిన్ని పదును వర్షాలు కురిస్తే రైతులు దుక్కుల వైపు మొగ్గు చూపుతారు. వీటినే ఏరువాక సేద్యాలు అని కూడా పిలుస్తారు. సేద్యాలు పూర్తి చేసుకున్న అనంతరం రుతుపవనాల వాతావరణ వల్ల వచ్చే పదును వర్షాలు ఖరీఫ్ సీజన్‌లో సాగించే పంటలకు ఉపయోగపడతాయి. భూమి ఉగ్గు రేగిన తర్వాత సేద్యాలకు ఉపక్రమించడం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూమికి ఏటవాలుగా సేద్యం చేయాలి.. తద్వారా భూమి లోపల దాగి ఉండే క్రిములు, కీటకాలు తీవ్రమైన ఎండలకు నశిస్తాయి. దీనివల్ల కలుపు నివారణ సమస్య తగ్గుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అలాగే దుక్కులను లోతుగా చేయాలి.. దీనివల్ల వర్షాభావ పరిస్థితిలో సాగులో ఉన్న పంటలకు కాస్త ఊరట కలుగుతుందని రైతులు చెబుతున్నారు. చేలకు మట్టి చేరవేసిన తర్వాత పదును వర్షాలు వస్తే వివిధ రకాల పంటలు పండించుకునే వెసులుబాటు ఉంటుంది. ముఖ్యంగా రసాయనిక ఎరువుల వినియోగానికి స్వస్తి కలిగి ప్రకృతి వ్యవసాయపు మగ్గు చూపాలని, అలాగే సేంద్రియ ఎరువులను వాడడం వల్ల అటు భూమి సారవంతంగా ఉండడంతోపాటు నాణ్యమైన దిగుబడి చేతికందే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆ దిశగా ఈ ఏడాది రైతులకు ప్రకృతి సహకరించాలని ఆశిద్దాం.

రోడ్లపై మురుగు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం సిఎంఆర్ కాలనీలో ఉన్న రోడ్డుపై నిత్యం జన సంచారం ఉంటుంది. కొండాపురం పాత బస్టాండ్ ప్రాంతంలోని ప్రజలు సిఎం ఆర్ కాలనీ ప్రజలు జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే ఇదే ఏకైక రహదారి. ఈ రహదారిపైకి చుట్టుపక్కల నివాసగృహాల వారు మురికి నీటిని, స్నానపు నీటిని, వృథాగా వదిలే కుళాయి నీరు ప్రధాన రహదారిపైకి వదులుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ దారిలో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ దారిలో నిత్యం తిరిగే గ్రామ పరిపాలనా అధికారులు, నాయకులు, పోలీస్ అధికారులుగానీ ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ దారిన వెళ్లేవారు అనేకమంది మురుగు నీటిలో పడి గాయాల పాలైనప్పటికీ ఏ అధికారి స్పందించడంలేదు. చుట్టుపక్కల ఇళ్ల వారు తమ ఇంటి ప్రాంగణంలో మురుగునీటి గుంతలు ఏర్పాటు చేసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ముస్లిముల అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర గౌరవాధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముస్లిములు విద్య, రాజకీయ పరంగా ముందుండాలనే లక్ష్యంతోనే ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందని రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. ఆదివారం తిరుపతి పట్టణంలోని బాబా జగజీవన్ రామ్ భవనంలో ముస్లిముల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపరంగా ముస్లిములు వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలు అవుతున్నా దేశంలో, రాష్ట్రంలో ముస్లిములు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు కొనసాగించామని చెప్పారు. దేశంలో,రాష్ట్రంలో రాజకీయపరంగా ముస్లిముల దామాషా ప్రకారం అందాల్సిన హక్కులు అందడం లేదని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు ముస్లిములను ఓటు బ్యాంక్‌గానే చేస్తున్నారని విమర్శించారు. ఓట్లు మావే సీట్లు మావే అనే నినాదంతో ముస్లిము ఐక్యవేదిక ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. 2024 ఏడాదికి హజ్‌కి వెళ్లే ప్రయాణికులపై వేరే రాష్ట్రాల కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడాన్ని ఐక్యవేదిక నిల దీసిందని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ పెద్దలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తుందని తెలియజేయడం సంతోషించదగ్గవిషయమని చెప్పారు.సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు జియావుల్ రెహమాన్, మదన పల్లి మాజీ ఎంఎల్‌ఎ షాజహాన్ బాషా, రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ వలి, జాయింట్ సెక్రటరీ సయ్యద్ నూర్, అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్, మదనపల్లి అధ్యక్షులు ఫయాజ్, నజీర్, మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ సలావుద్దీన్

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ పాఠశాలలు నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని పిడిఎస్‌యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ యాజమాన్యాలు పాఠశాల నిబంధనలకు విరుద్ధ:గా పెద్ద,పెద్ద హోర్డింగ్‌లు ప్రచారాలతో హోరెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికే కార్పొరేట్ పాఠశాలలు సగం అడ్మిషన్లు పూర్తి చేశాయని చెప్పారు. ఐఐటి, జెఇఇ, ఎన్ఇఇటి ఫౌండేషన్ ఎసి క్యాంపస్ పేరుతో ఇటీవల కళ్యాణ మండపంలో తల్లిదండ్రులతో సదస్సు కూడా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు స్వరూప్ తేజా పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు భవనం

ప్రారంభానికి సిద్ధం.. ఐసిడిఎస్ భవనం

ప్రజాశక్తి - చాపాడు

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టుల పునర్విభజనలో భాగంగా చాపాడుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు మంజూరైన విషయం తెలిసిందే. ప్రాజెక్టు కార్యకలాపాలు నిర్వహించేందుకు ఖాళీగా ఉన్న ఎస్‌సి బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. భవనానికి చిన్నపాటి మరమ్మతులు చేసి, రంగులు వేశారు. చాపాడు ప్రాజెక్టు కింద చాపాడు, దువ్వూరు, బి మఠం మండలాలున్నాయి. చాపాడు ప్రాజెక్టు సిడిపిఒగా సావిత్రి విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో భవనాన్ని ప్రారంభించేందుకు సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. నూతన ప్రాజెక్ట్ ఏర్పాటుతో అంగన్వాడీల పర్యవేక్షణ సులభతరంగా ఉంటుందని సిబ్బంది పేర్కొంటున్నారు.

పొలం ఆన్‌లైన్ కోసం ఆర్‌బికెను సంప్రదించాలి

ప్రజాశక్తి - దువ్వూరు

రైతులు తమ పొలాన్ని ఆన్‌లైన్ చేసుకునేందుకు ఈనెల 18లోపు ఆర్‌బికెలను సంప్రదించాలని ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ కాని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వన్ బి కొత్తది, పొలం పాస్ పుస్తకం, రేషన్ కార్డు, బ్యాంక్ జిరాక్స్ కాపీలను రైతులు వెంటతెచ్చుకోవాలన్నారు.

పూజారికి రెడ్యం పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని దుంపలగట్టు శ్రీశ్రీశ్రీ మహాకాళి అంకాలమ్మ ఆలయ పూజారి గువ్వల గంగాధర్‌ను గ్రామంలోని తన ఇంట్లో ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. అంకాలమ్మ ఆలయంలో శనివారం కరెంట్ రాకపోవడంతో పూజారి నిచ్చెనెక్కి పరిశీలిస్తుండగా కిందపడి రెండు చేతుల మణికట్టు వద్ద ఎముక చిట్లింది.

గ్రంథాలయంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా పిల్లలకు విజ్ఞానంతోపాటు మానసిక ఉల్లాసానికి ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. క్యారం బోర్డు, చెస్ వంటి పోటీలను విద్యార్థులకు పెట్టామని రికార్డ్ అసిస్టెంట్ ఉమాదేవి తెలిపారు. కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు జగన్నాధం, పాఠకులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



దుస్తుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న గంగవరం శేఖర్‌రెడ్డి

ప్రజల మన్ననలు పొందాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వ్యాపారంలో ప్రజల మన్ననలు పొందాలని వైసిపి (రెబల్) సీనియర్ నాయకులు గంగవరం శేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రవీణ్ జెంట్స్ వేర్ అనే నూతన దుస్తుల దుకాణాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణ యజమాని ప్రవీణ్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మల్లు గోపాల్‌రెడ్డి, చిన్న దండ్లూరు సర్పంచు రాముడు, మాలెపాడు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



గ్రామ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

గొడవలకు దిగితే చట్టరీత్యా కేసులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గొడవలకు దిగినా, రెచ్చగొట్టేచర్యలకు పాల్పడినా చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని సిఐ మంజునాథరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని వై.కోడూరు గ్రామంలో ఆదివారం ఉదయం సిఐ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. మొదట గ్రామంలోని పలు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామ నాయకులతో చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదుట సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఎలాంటి గొడవలకు పాల్పడకూడదని సూచించారు. గ్రామంలో ఇటీవల జరిగిన గొడవ కారణంగా మళ్లీ పునరావృతం కాకుండా ఒక ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లను ఉండేలా క్యాంపు పెట్టబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఎఎస్ఐ చంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని శిల్పారామంలో విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగిణి బృందం వారిచే కూచిపూడి, శాస్త్రీయ, సినీ, జానపదాలకు నృత్యం చేశారు. మిస్ప్రా మూవీ మీడియా సహకారంలో ఆకాష్ బైజూస్ సహాయ సహకారాలు అలందించాయి. వేసవి శెలవులు కావడంతో చిన్నారులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాలను ఎఒ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు



నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు.అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

- విజేతలుగా రాజు హాకీ అకాడమీ క్రీడాకారులు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని రాజు ఒలంపియాడ్ స్కూల్ మైదానంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజులు పాటు నిర్వహిఒంచిన జనార్దన్ రెడ్డి మెమోరియల్ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి.ఈ సందర్భంగా చివరి రోజు ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో అనకాపల్లి జిల్లా జట్టుపై అన్నమయ్య జిల్లా రాజు అకాడమీ జట్టు 2-5 తేడాతో విజయం సాధించింది. బాలికల విభాగంలో అనకాపల్లి జట్టుపై అన్నమయ్య జిల్లా రాజు హాకీ అకాడమీ క్రీడాకారులు 2-0 తేడాతో గెలుపొందారు. మూడు రోజులు పాటు ఉత్కంఠ భరితంగా సాగిన రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలలో బాలుర విభాగంలో విన్నర్స్‌గా రాజు హాకీ అకాడమీ జట్టు, రన్నర్స్‌గా అనకాపల్లి జిల్లా నక్కపల్లి జట్టు, మూడో స్థానంలో రాయచోటి హాకీ అకాడమీ జట్టు నిలి చింది. బాలికల విభాగంలో విన్నర్స్ గా రాజు హాకీ అకాడమీ జట్టు, రన్నర్స్‌గా అనకాపల్లి జిల్లా నక్కపల్లి జట్టు, మూడవ స్థానంలో కడప జట్టు నిలిచాయి. ఉత్తమ క్రీడాకారులుగా యోగేశ్వర్ రెడ్డి, అంశిక రాజు, గీతిక,సాయి నందిని, గీత, పూర్ణిమ, విష్ణు ప్రియ తదితరులు ఉత్తమ ప్రతిభ కనబ రిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాజు విద్యాసంస్థల అధినేత చమర్తి జగన్ మోహన్‌రాజు సహకారంతో రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలను రాయచోటిలో నిర్వహించడం గొప్ప శుభ పరిణామం అన్నారు.ఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన సీనియర్ హాకీ క్రీడాకారులు సుధాకర్, సిఐ చంద్రశేఖర్‌తో పాటు దాతలను వారు అభిన ందించారు. అనంతరం విజేతలకు బహుమతులను రాయచోటి మైనార్టీ లీడర్ హబీబ్ ఖాన్, శాంత కుమార్ రాజు, ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పా ండెంట్ శ్రావణి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు,మైనార్టీ నేత హబీబుల్లాఖాన్, రాజంపేట శరత్ కుమార్ రాజు, రాయచోటి హాకీ అకాడమీ అధ్యక్షులు దువ్వూరి నరసింహాచారి, రాజు హాకీ అకాడమీ సెక్రటరీ నాగేశ్వరరావు, కోశాధికారి ఖధీరుల్లా ఖాన్, కమిటీ సభ్యులు మహేశ్వర్ రాజు, శివప్రసాద్ నాయుడు,రామ,రెడ్డి శేఖర్ రాజు, హాకీ కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన హాకీ క్రీడాకారులతో నిర్వాహకులు

ప్రమాదాలు అరికట్టడమే లక్ష్యం

జిల్లా రవాణా అధికారి ఎస్. శాంతకుమారి

ప్రజాశక్తి - రాయచోటి



ముఖా ముఖి..

ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టడమే తమ లక్ష్యమని జిల్లా రవాణా అధికారి ఎస్ . శాంతకుమారి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రోడ్డు భద్రత నియమాల పాటించి వాహనదారులు ప్రమాదం జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆమె వివరించారు .

అన్నమయ్య జిల్లాల్లో కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా రాయచోటి, మదనపల్లిలో ఆర్‌టిఒ కార్యాలయాలు, రాజంపేట, పీలేరు ప్రాంతాల్లో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలున్నాయి. 2022-23 సంవత్సరానికి గాను వాహనదారుల నుంచి రూ. 18.108 కోట్లకు గాను రూ.10.043 కోట్ల చలానా వసూలు చేశామన్నారు. అలాగే 2023-24 సంవత్సరానికి రూ. 17.19 కోట్లకు గానూ ఇప్పటి వరకు రూ. 10.85 కోట్ల చలానా వసూలు చేశామని వివరించారు.

డ్రైవింగ్ లైసెన్స్ మంజూరులో కొత్త విధానాన్ని ఏమైనా ప్రవేశ పెడుతున్నారా ?

మాన్యువల్ టెస్టింగ్ స్థానంలో కొత్తగా సాంకేతిక విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించాయి. డ్రైవింగ్ లైసెన్స్‌లో టెస్ట్ విధానంలో కొత్త మార్పులను తీసుకొస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మోటర్ వెహికల్ చట్టానికి అనుకూలంగా లైసెన్సులు జారీ చేస్తున్నాం .

డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు ఏ పద్ధతిలో కొనసాగిస్తున్నారు?

చాలా సంవత్సరాల నుంచి మాన్యువల్ టెస్ట్ పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఆర్టీవో అధికారులు పర్యవేక్షణలో డ్రైవింగ్ విధానాన్ని నియమ నిబంధనలను పాటిస్తూ వాహనదారుడు వాహనాన్ని నడిపితే , ఆర్టీవో సంతృప్తి చెందితే అతడికి లైసెన్స్ మంజూరు చేయడం జరుగుతుంది.

ఫెయిల్ అయినా అభ్యర్థి ఎన్ని రోజులలో తిరిగి డ్రైవింగ్ టెస్ట్ హాజరు కావాలి?

వాహనదారుడు ఫెయిల్ అయిన అభ్యర్థి ఒక నెల తర్వాత దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల లోపల వాహనాదారుఢు డ్రైవింగ్ శిక్షణ చేసుకోవాలి .

రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నెలకొకసారి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎస్‌పి ఇతర శాఖలతో ప్రమాదాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. రోడ్డు భద్రత నివారణ చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలు పదేపదే జరిగే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రదేశంలో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి ఏడాది జనవరి నెలలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నాం .

డ్రైవర్లకు ఏమైనా సలహాలు ఇవ్వాలని అనుకుంటున్నారా ?

వాహనం నడుపుతున్న ప్రతి డ్రైవరూ ట్రాఫిక్ నియమ నిబంధన పాటించా. మద్యం సేవించి వాహనం నడపరాదు. మద్యం సేవించి వాహనదారుడు వాహనాన్ని నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం .ద్విచక్ర వాహనం వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. అలాగే వాహనదారులు సీటు బెల్టు ధరించి ధరించాలి. ఎనిమిది గంటలు ప్రయాణం దాటితే 2వ డ్రైవర్ ను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో ప్రయాణాలు నివారించాలి. అత్యంత పరిస్థితి లో మాత్రమే ప్రయాణించాలి.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

జిల్లా కురుబ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని సుధాకర్ కళ్యాణమండపంలో రాష్ట్ర కురువ సంఘం పర్యవేక్షణలో అన్నమయ్య జిల్లా కురువ సంఘ , మహిళా సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కురువ సంఘ అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు లైన్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక చేశారు. జిల్లా అధ్యక్షులుగా రవిశంకర్, కార్యదర్శిగా పీలేరుకు చెందిన సహదేవ, కోశాధికారిగా మంగిరి రమణయ్య ఎన్నికయ్యారు. మహిళా జిల్లా అధ్యక్షులుగా మదనపల్లి చెందిన జబ్బల కళావతి , జిల్లా మహిళా కార్యదర్శిగా వర లక్ష్మిని ఎన్నుకున్నారు. ఉద్యోగ సంఘ అధ్యక్షులుగా మురళిని ఎన్నిక చేశారు. వీరు రెండు సంవత్సరాల కాలం పరిమితి ఉంటుందని తెలిపారు. రెండేళ్ల కాలంలో కురుబల అభ్యున్నతికి ఎదుగుదలకు విద్యాపరంగా ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రెడ్డన్న, ఆర్ వి రమణ, చౌడయ్య, నాగరాజ, ఈశ్వరయ్య, మోక్షిత్ పాల్గొన్నారు .



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కర్ణాటక ప్రజాతీర్పు బిజెపికి గుణపాఠం

- సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

బిజెపి ని రంకుశ మతోన్మాద విధానాలకు వ్యతి రేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పును గుణ పాఠంగా తీసుకుని మన రాష్ట్రంలో ప్రధా న రాజకీయ పార్టీలు అవకాశవాదంతో బిజెపితో అంట కాగడం మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ మత రాజకీయాలకు చెంప పెట్టని, ప్రజా స్వామ్యం, రాజ్యాంగ విలువలు గెలవాలని తెలిపారు. రాజ్యాంగ సూత్రాలను ధిక్కరిస్తూ క్రోనీ క్యాపిటల్ లిస్ట్ పద్ధతిలో ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్న ప్రధాని మోడీని గద్దది ంచేందుకు సాగునున్న పోరాటంలో విజయం సాధించిన కర్ణాటక ప్రజలకు అభినంధనలు తెలిపారు. బిజెపి మన రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, ముఖ్యంగా ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాల అభి వద్ధికి ప్రత్యేక నిధులు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటుకు దారదత్తం చేసే దిశగా ముందుకు వెళుతుందన్నారు. విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు, ఆస్తుల పంప కాలను పరిష్కరించకుండా అన్యాయం చేస్తు ందన్నారు. మోడీని ప్రసన్నం చేసుకోవడానికి ఆత్మగౌరాన్ని తాకట్టు పెడు తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ దాడులకు భయపడి ఏం చెప్పి నా తాళం వేస్తున్నాయని ఎద్దేవ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ మత ఘర్ష ణలు సష్టించడానికి ప్రయత్నిస్తున్న బిజెపికి ఆయాపార్టీల నాయకులు మద్దతిస్తున్నారని విమర్శించారు. బిజెపి చేస్తున్న మోసాన్ని. రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని రానున్న ఎన్నికల్లో నిలదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు రామమోహన్, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

బిసిల ద్రోహి వైసిపి

కడప అర్బన్ : బిసిల ద్రోహి వైసిపి ప్రభుత్వమని టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు మేకల బాబు అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి ఇచ్చిన తరువాత 26 మంది బిసిలకు పొట్టనపెట్టుకుందని విమర్శించారు. సిఎం పదవి నుంచి జగన్‌మోహన్‌రెడ్డిని గద్దెదించే పని బిసిలదే అన్నారు. ముష్ఠి నాలుగు పదవులు ఇచ్చి అన్ని చేశామ అన్నట్లు మాట్లాడుతున్నారని చెప్పారు. జగన్ ఏమిచెబితే బిసి మంత్రులు తల ఊపాల్సిందేనని పేర్కొన్నారు. టిడిపి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగారెడ్డి, హరి మాట్లాడుతూ జగన్ పాదయాత్రంలో బిసిలు బ్యాక్ బోన్ అని ఇప్పుడు వెనక్కు నెట్టేస్తున్నారని విమర్శించారు. టిడిపి సబ్లప్లాన్ కింద పనిముట్లు ఇచ్చేదని, జగన్ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని తెలిపారు. 58 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు లేకుండా చేశారని చెప్పారు. బిసి నిధులు నవరత్నాలకు మళ్లించారని విమర్శించారు. బిసి రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రామప్రసాద్ మాట్లాడుతూ క్యాబినెట్ హోదా ఉండే పదవులు అగ్రవర్ణాలకు, అధికారం లేని చైర్మన్ పదవులు బిసిలకు ఇచ్చారని తెలిపారు. 136 కులాలకు చేసింది శూన్యమని విమర్శించారు.

విద్యార్థులకు అండ ఎస్ఎఫ్ఐ జెండా

జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులకు అండగా ఎస్ఎఫ్ఐ జెండా ఉంటుందని జిల్లా కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. మదనపల్లి పట్టణంలో మూడవరోజు 'విద్యార్థుల ఉద్యమం-ఎస్ఎఫ్ఐ విశిష్ఠ' అంశంపై ఆయన మాట్లాడుతూ జాతీయ స్వతంత్ర్య ఉద్యమస్ఫూర్తితో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని విద్యార్థుల లోకానికి పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 1970 స్వాతంత్ర్యం , ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని అన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల సమరశీల పోరాటాలు చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తూ సమస్యలు పరిష్కారం దశగా ముందుకు సాగుతుందని అన్నారు. భగత్‌సింగ్ , రాజ్‌గురు, సుకుదేవ్ అల్లూరి సీతారామరాజు సమరయోధులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతుందన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా కార్పొరేట్ కబంధహస్తాల్లో ఉందని చెప్పారు. పేద బడుగు , బలహీన వర్గాలకు విద్యా అందని ద్రాక్షల ఉందని తెలిపారు. దేశంలోకి విదేశీ యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ పేద విద్యార్థులను ఉన్నత చదువులను దూరం చేయడం తప్ప ఇంక ఏమి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బైజూస్‌తో డిజిటల్ విద్య అందిస్తామంటూ ఉపాధ్యాయులను తగ్గించే కార్యక్రమం చేసింది అన్నారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పైన భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విద్యార్థులను చైతన్యం చేస్తే జిల్లాలో ఒక బలమైన విద్యార్థి ఉద్యమ నిర్మించడానికి ఎస్ఎఫ్ఐ ఈ క్లాసులు నాంది అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, ఉపాధ్యక్షులు రమణ, నరేష్ ,నిరంజన్, వెంకట్, జయ ప్రకాష్ జిల్లా నలుమూలల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాసమస్యల పరిష్కారానికే గడప గడపకూ.. : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెలోని రాజానగర్ తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వనటువంటి హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. కుల,మత రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ఉద్దేశమన్నారు. ఇకపోతే మదనపల్లి పట్టణంలోని అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేశామన్నారు. అందుకోసం జగనన్న నిధులు మంజూరు చేశామన్నారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల శ్రేయస్సు కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, వైసిపిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండు రామాంజులు, తొగట కార్పొరేషన్ డైరెక్టర్ శీలం రమణమ్మ రమేష్, బీసీ జిల్లా నాయకులు బెల్లే రెడ్డి ప్రసాద్, జీవీ శివ కుమార్, మునిసిపల్ కో -ఆప్షన్ మెంబర్ శారదా రెడ్డి, కౌన్సిలర్ ఎం.వి.రమణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే

వామపక్షాలతోనే దేశాభివృద్ధి సాధ్యం

-సీనియర్ వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వామపక్షాలతోనే దేశాభివృద్ధి సాధ్యమని సీనియర్ వామపక్ష నాయకులు ఉద్ఘాటించారు. ఆదివారం హేతు వాద సంఘం, కార్మిక సంఘం నాయకులు సిఆర్వీ ప్రసాద్, డబ్ల్యూ రాము ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఐఎంఎ ఫంక్షన్ హాల్‌లో వామపక్ష పార్టీల సీనియర్ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో పలువురు పాతతరం ఉద్యమ నేతలు హాజరై మాట్లాడారు. గతంలో వారు చేసిన ఉద్యమాలు ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్య పరిచి వామ పక్ష భావాలను ప్రజల ముందుకు తీసుకు వెళ్ళాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశంలో నేటి సామాజిక, రాజకీయ పరిస్థితులు దారు ణంగా ఉన్నాయని, మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడు కోవాల్సిన అవసరం ప్రతిఒక్కరి పై ఉందన్నారు. సిఆర్వీ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాలు స్తబ్దతగా ఉన్న నేపథ్యంలో మరోసారి ఎర్రజెండాయే అజెండాగా ప్రజా సమస్యలపై పోరాలు చేసేందుకు అందరిని సమాయత్తం చేయాలని ఆలోచనతో సమావేశం నిర్వహించామని చెప్పారు. పాతతరం నేతల ఉద్యమ నేపథ్యాన్ని దష్టిలో ఉంచుకుని వారి సలహాలు, సూచనలతో ముందుకెళ్ళేందుకు శ్రీ కారం చుట్టామని తెలిపారు. అనంతరం నాటి పాతతరం నాయకులు పుల్లారెడ్డి, వెంకటాద్రి, లింగమూర్తి, శివాజీ, చెన్నకేశవ రెడ్డిని సన్మానం చేశారు. సమావేశంలో రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్, జైలు సూపరింటెండెంట్ ఫణి రాజు, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ రామ్ గోపాల్, డాక్టర్ ఓబుల్ రెడ్డి, సీనియర్ నాయకులు మామిడి మురళీ మోహన్, ప్రసాద్ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, వారాధి జోసెఫ్, సావంత్ సుధాకర్,బి.నారాయణ, భగవాన్ రెడ్డి, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, జి.చంద్ర శేఖర్, భాస్కర్, నగర కార్యదర్శులు వెంకట శివ, రామమోహన్, జిల్లా నాయకులు దస్తగిరిరెడ్డి, మద్దిలేటి, గంగా సురేష్,మనోహర్ రెడ్డి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వామపక్ష నేతలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో సీనియర్ వామపక్ష నాయకులు

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి : డివైఎఫ్ఐ

బద్వేలు : కొద్ది రోజులుగా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజు భూషణ్‌ను అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బద్వేల్ పట్టణంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశానుదేశించి ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలాగా రెజ్లర్ల మహిళా క్రీడాకారులు బంగారు, కాంస్య పతకాలను ఒలంపిక్ టిక్కో ఒలంపిక్‌లో సాధిస్తుంటే వారికి అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధిం పులకు పాల్పడ్డం దారుణమని వాపోయారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారి పైన వెంటనే కఠిన చర్య తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరిలో ఆందోళనకు దిగితే ప్రభుత్వం కమిటీ వేసి విచారిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలైనా పట్టించుకోకపోవడంతో కొద్ది రోజుల కిందట ఏడుగురు మహిళా రెజ్లర్ల క్రీడాకారులు సుప్రీంకోర్టును ఆశ్రయి ంచారని చెప్పారు. కోర్టు సైతం ఇది తీవ్రమైన ఆరోపణ తక్షణమే ఢిల్లీ పోలీసులు స్పందించి చర్య తీసుకోవాలని ఆదేశించిందని చెప్పారు. తక్షణమే మోడీ ప్రభు త్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ పై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా డివైఎఫ్ఐ , విద్యార్థి యువజన సంఘాలను ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఎ త్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు గంగనపల్లి నాగార్జున మహిళ కన్వీనర్ గురుదేవీ పాల్గొన్నారు.

డిబిఎన్ పల్లెలో గ్యాస్ లీక్

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని డిబి ఎన్‌పల్లె దళితవాడలోని ఓ ఇంట్లో గ్యాస్ లీక్ అయ్యి మంటలు ఉవ్వెత్తున చెలరేగాయి. వివరాలు.. ఆదివారం దళిత వాడలోని బాలిపోగు పెంచలయ్య ఇంటిలో ఉదయం వంట చేయడానికి గ్యాస్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో కుటుంబసభ్యులతో భయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంలో స్పందించిన సిబ్బంది హుటాహుటీనా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రెగ్యులేటర్ సరిగా లేనందున ప్రమాదం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది నిర్ధారి ంచారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసు కోవాల్సిన బాధ్యత గ్యాస్ డెలివరీ బాయ్‌దేనన్నారు. ప్రమాదంలో రూ.10 వేలు విలువ చేసే వస్తువులు మంటల్లో కాలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.



ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు బ కీ.శే. గ్రోసు గోపాలయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో గోల్డ్ మెడల్ ఇవ్వనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటరమణ, కార్యదర్శి ఎం.వి. రమణ, కోశాధికారి నారు శ్రీధర్ పేర్కొన్నారు. జిల్లాకు చెందిన పది, ఇంటర్‌లలో అత్యమార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ 4న నెల్లూరు లో నిర్వహిం చబోయే రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో బహుమతి ప్రదానం చేస్తారన్నారు.



రక్తదానం చేస్తున్న దాతలు

మాతృ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తల్లి జన్మనిస్తే , రక్తదాత పునర్జన్మిస్తారు రక్తదాత తల్లితో సమానమని బ్లండ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి అమరావతి పేర్కొన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా వెల్ విషర్స్ అండ్ ఫ్రెండ్స్ టు సపోర్ట్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెల్ విషర్స్ సభ్యులు హరిబాబు, అరుణ్, గిరీష్, మంజునాథ్, శ్రేయస్, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ నియామకం

రాయచోటి :

రాయచోటి శ్రీ చౌడేశ్వరి ఆలయ నూతన కమిటి నియమించినట్లు రాష్ట్ర తొగట వీర క్షత్రియ సేవా సంఘం వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆలయ అధ్యక్షునిగా మార్కాపురం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సిబ్యాల విజయభాస్కర్, ట్రెజర్‌గా బొమ్మల వెంకటరత్నం, గౌరవ అద్యక్షులుగా పురం బాలాజీ, ఉపాద్యక్షుల, కార్యవర్గ సభ్యులను నియమించామన్నారు. ఆలయాన్ని అన్ని విధాలా అబి వృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంత్లీ రోలింగ్ చెస్ ట్రోఫీ విజేతగా లిఖిత్

ప్రజాశక్తి - కడప

జిల్లా చెస్ అసో సియేషన్ ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించిన 16వ అస్రాఫ్ ప్రసన్న మంత్లీ రోలింగ్ చెస్ టోర్నమెంట్ ట్రోఫీ విజేతగా ఇటీవలే ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ సాధించిన రేటెడ్ చెస్ క్రీడాకారుడు లిఖిత్ నిలిచాడు. ఐదు రౌండ్లకు గాను 4.5 పాయింట్లు సాధించి టోర్నీ విజేతగా లిఖిత్ నిలిచాడు. రెండవ స్థానాన్ని మరో రేటెడ్ క్రీడాకారుడు ప్రభుదేవా దక్కించుకున్నాడు. మూడవ స్థానంలో రేటెడ్ క్రీడాకారుడు వినీల్ నిలిచాడు. 4 నుంచి 10 స్థానాలలో ప్రదీప్ చంద్ర, ప్రణీత్, సాకేత్, పృథ్వీ, అభిరామన్, యాఫియా, అశుతోష్ నిలిచారు. ఈ టోర్నమెంట్ లో జిల్లా నలుమూలల నుంచి 26 మంది చెస్ క్రీడాకారులు పాల్గొనగా ఐదు రౌండ్లుగా టోర్నమెంట్‌ను చీఫ్ ఆర్బిటర్ టి. శ్రీకాంత్ నిర్వహించారు. జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనపరిచారని అసోసియేషన్ కార్యదర్శి అనీష్ దర్బారి తెలిపారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అనీస్ దర్బారి, చెస్ కోచ్ తబస్సుమ్, చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్ చేతుల మీదుగా అందజేశారు.



మహిళలను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారి రమాపతి

తల్లిదండ్రులను గౌరవించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చిన్న వయస్సు నుంచే ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరించాలని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో మాతృదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవమాసాలు మోసి, కని పెంచిన తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గౌరవించి, వారిని ప్రేమగా చూసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు యామని, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సుప్రియలను దుశ్శాలవతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తల్లులు రాధ, కల్యాణి, యశోదమ్మ, భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి పాద యాత్రను విజయవంతం చేయాలని మండల టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి రామ కృష్ణగౌడ్ కోరారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గలం పాదయాత్ర సోమవారంకి వంద రోజులు పూర్తి కావడంతో ఆయనకు మద్దతుగా రమేష్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారు. లోకేష్ బాబు పాదయాత్రకు సంఘీభావంగా రాయచోటి పట్టణం అన్నమయ్య సర్కిల్ నుంచి మాసాపేట తానా చెక్ పోస్ట్ మదనపల్లి రోడ్డు కొత్తపేట మీదుగా బస్టాండు నేతాజీ సర్కిల్ వరకు ఈ పాదయాత్ర కొనసాగుతుంది. నాయకులు, కార్యకర్తలు ఈ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు నాగ భూషణ్‌రెడ్డి, మండల నాయకులు బాబు, యశోదర పాల్గొన్నారు.

అష్టోత్తర శత కుండాత్మక యాగానికి ఆహ్వానం

ప్రజాశక్తి-నందలూరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మమోహన్‌రెడ్డి ఈనెల 12 నుంచి 17 తేదీ వరకు విజయవాడలో జరుప తలపెట్టిన యాగానికి నందలూరుకు చెందిన నడివీధి సుధాకర్‌కు అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ యజ్ఞంలో అష్టోత్తర శత కుండాత్మక, ఛండీ, రుద్ర, రాజా శ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞము జరుగుతుందని అన్నారు. ప్రజల శాంతి, సౌభాగ్యల కోసము ,పాడి పంటల సమృద్ధి, ప్రకృతి మాత అనుగ్రహము కొరకు చేపట్టిన యజ్ఞమని అన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి తనకు ఈ ఆహ్వానం అందినట్లు తెలిపారు.

కువైట్‌లో టిడిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

కువైట్ పర్యటలో ఉన్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వి.ఎస్.అమీర్‌బాబును కువైట్ పారిశ్రామికవేత్తలు సన్మానించారు. కువైట్‌లోని పారిశ్రామిక వేత్తలను కలిశారు. పలు విషయాలు చర్చించారు. కార్యక్రమంలో కువైట్ దేశానికి చెందిన అబ్దుల్ అజీస్ ఆల్ హసవి, ఫహద్ ఆల్ హాసవి, ఖలిద్ ఆలహ హాసవి, అబ్దుల్ రెహమాన్, ఆల్ దోసారి, టిడిపి నాయకులు రహమతుల్లా, ముస్తాక్ ఖాన్, ఖాదర్ బాష, సయ్యద్ అలీ, విజయ్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లీష్‌లో పట్టుసాధించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు ఇంగ్లీష్‌లో పట్టు సాధిస్తే అంతర్జాతీయంగా రాణిస్తారని ఉపాధ్యాయురాలు సత్యవతి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ ప్రయోజనాలు తెలియజేశారు. ఇంగ్లీష్ సులువుగా నేర్చుకోవడానికి స్పోకెన్ ఇంగ్లీష్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్ మాట్లాడుతూ 30 రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులుంటాయని చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్స్ సురేష్, సుబ్రహ్మణ్యం, నవాబ్ జాన్, జేమ్స్, సిబ్బంది, రామ్ ప్రతాప్, సుబ్బమ్మ, హరికృష్ణ, నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్‌లో ప్రతి మంగళవారం ఉచిత సంతాన సాఫల్య సలహా,చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నామని ఇన్‌ఫెర్టిలిటి స్పెషలిస్టు డాక్టర్ వై.ప్రమోద ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 2 వరకు సంతానం లేమి సమస్యతో బాధపడే దంపతులకు ఉచిత శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మదర్ థెరిసా చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ థెరిసా చిత్ర పటానికి టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బాయ్య ఆదివారం పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి రాయల్ కరీముల్లా, పి.ఉస్మాన్‌ఖాన్, దస్తగిరి, జనార్ధన్‌రెడ్డి, బాదుల్లా, అజంతుల్లా పాల్గొన్నారు.

విద్యతో బంగారు భవిష్యత్తు

కడప అర్బన్ : విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఉస్మానియా యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ ఆచార్య మహమ్మద్ అబ్దుల్ హమీద్ అన్నారు. ఆదివారం బెల్లంమండి వీధిలోని జెహరా మద్రాసాలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆర్థిక పరిస్థితిని చూసుకుని విద్యాభ్యాస్యం చేయాలని సూచించారు. చదవడానికి అన్నిఅవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సిఎఫ్ డైరెక్టర్ సయ్యద్ యూనుస్, జమాతే ఇస్లామి హింద్ బాధ్యులు అక్రమ హుస్సేన్,జాకీర్, ఎంపిజె జిల్లా అధ్యక్షులు వి.ఎస్.రహమతుల్లా పాల్గొన్నారు.

సృష్టికి మూలం అమ్మ

కడప అర్బన్ : సృష్టికి మూ లం అమ్మా అని క్యాపిటల్ చర్చి ఫాదర్ బిరుసు రాజా అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మాతృ దినో త్సవాన్ని పురస్క రించుకుని క్యాథడల్ చర్చిలో మాతృ దినోత్సవ వేడుకలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్ఠిలో అమ్మ అనే పదం చాలా గొప్పదన్నారు. అమ్మకు మించిన దైవం లేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తల్లిని ఆరాధించాలని చెప్పారు. అమ్మ ప్రేమ వెలకట్టలేమని పేర్కొన్నారు. పాస్టర్ చంద్ర మాట్లాడుతూ అమ్మ రుణం తీర్చుకోలేమన్నారు. ఎల్లవేళల రుణపడి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కన్య స్త్రీలు, ఉపదేశీలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం

కడప అర్బన్ : చుక్కల భూములపై ప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకమని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు దేవర శ్రీకృష్ణ అన్నారు. ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెవెన్యూ విభాగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పు అన్నారు. జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, లేకపోతే రైతులు మరల లంచాలతో దళారుల చేతిలో నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు

కడప అర్బన్ : నగరంలోని శిల్పారామంలో విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగిణి బృందం వారిచే కూచిపూడి, శాస్త్రీయ, సినీ, జానపదాలకు నృత్యం చేశారు. మిస్పా మూవీ మీడియా సహకారంలో ఆకాష్ బైజూస్ సహాయ సహకారాలు అలందించాయి. వేసవి శెలవులు కావడంతో చిన్నారులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాలను ఎఐ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

టమోటాకు గిట్టుబాటు ధరలు పతనం..ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-ములకలచెరువు

బహిరంగ మార్కెట్లలో టమోటా ధరలు పతనమై రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించక అప్పుల బాధతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వ్యవసాయ బోర్ల ఆయకట్టులో సుమారు 500 ఎకరాలకు పైగా టమోటా పంటలు వేశారు. పంట సాగుకు ఎకరాకు సుమారు లక్షకు పైగానే ఖర్చు చేశారు. ట్రాక్టర్ తో భూమి దుక్కి, నర్సరీల నుండి టమాటా మొక్కలు, ఎరువులు, జీవన ఎరువులు, టమోటా మొక్కలకి కర్రలు, క్రిమిసంహారక మందుల, కూలీలు కోసం లక్షకు పైగా ఖర్చు చేయక తప్పడం లేదు. టమోటా రైతు తన పంటకు గిట్టుబాటు కావాలనుకుంటే సుమారు 15 కిలోల కిరిటి కనీసం రూ.300 నుంచి రూ.400 ధర దక్కాలి. అయితే నేడు మార్కెట్లో టమోటా 15 కిలోల కిరిట ధర 100కు మించడం లేదు. దీంతో టమోటా రైతు గిట్టుబాటు ధర లేక టమోటాలను పెరకడానికి కనీసం కూలి ఖర్చు మిగలకపోవడంతో పొలాల్లోనే వదలక తప్పడం లేదు. మండలంలోని వేపూరికోట, పెద్దపాలెం, బురకాయలకోట, గుడిపల్లి, కాలుపల్లి తదితర పంచాయతీలలో రైతులు వందలాది ఎకరాల్లో టమోటా సాగు చేసి చేతులు కాల్చుకున్నారు. టమోటా పంటల కోసం రైతులు అందిన కాటికి ప్రయివేట్ అప్పులు చేశారు. మరికొందరు రైతులు బ్యాంకులలో బంగారు నగలు తాకట్టు పెట్టి పంటలు వేసి నేడు ఆ నగలు విడిపించుకోవడానికి వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. టమోటా రైతుల కష్టాలు వినే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం టమోటా రైతుల పంట నష్టాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటుచేసి గిట్టుబాటు కల్పించాల్సిన అవసరముంది.



ధరలు లేక పశువులకు మేతగా వేసిన టమోటాలు

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

రైతులకు నాన్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొబ్బరివారిపల్లె గ్రామంలో ఆదివారం 33/11కెవి సబ్ స్టేషన్‌కు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని రైతులకు, కార్మికులకు, గృహాలకు నాణ్యమైన విద్యుత్తు నిరంతర సరఫరా చేయడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం సిస్టం ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్స్ ద్వారా మండలంలోని గొబ్బురువారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపిపి తమ్మిద తిరుపాల్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రతి పేద రైతుకి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తుందని, 24 గంటల కరెంటు రైతులకి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలపారు. తమ గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మించడం సంతోషదాయకంగా ఉందన్నారు. సబ్ స్టేషన్ కోసం శ్రమించిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిటూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర, మాజీ ఎంపిపి తమ్మిద తిరుపాలు, జడ్‌పిటిసి లక్ష్మి నరసయ్య, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పాపిరెడ్డి, విద్యుత్ ఎస్ఇ చంద్రశేఖర్, కాంట్రాక్టర్ యశ్వంత్‌రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


మండల వ్యాప్తంగా ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో హనుమాన్ చాలీసా, ద్వాదశాక్షర మంత్రము, అష్టోత్తర ములుతో భక్తిశ్రద్ధలతో హను మంతుడిని అర్చించారు. వైబిఎన్‌పల్లెలో వినాయక అభయాంజనేయ స్వామి దేవ స్థానంలో హనుమాన్ జన్మదిన వేడుకలు ఆలయ ధర్మకర్త పోతుగుంట రమేష్ నాయుడు సహకారంతో అప్పలాచారి ఆధ్వ ర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. **నిమ్మనపల్లి:** మండల పరిధిలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పెద్దమాది గపల్లి, నిమ్మనపల్లి లోని అభయాంజనేయస్వామి ఆలయాలలో ఆలయ ధర్మకర్తలు గౌరమ్మ, కొండకింద శ్రీనివాసులు బయమ్మ, శంకరయ్యల ఆధ్వర్యంలో అర్చకులు ద్వాదశాక్షర మంత్రము, హనుమాన్ చాలీసా, అష్టోత్తరములుతో హనుమంతుని ఆరాధించారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ టంగుటూరు ప్రకాశం పంతులు వీధిలో ఆంజనేయ స్వామి ఆలయంలో పల్లె మైరామ్‌రెడ్డి జ్ఞాపకార్థం పూజారి నాగ రాజుస్వామి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుర్రమణియాదవ్, శివ, పుత్త నాగేశ్వరరావు, రమణారెడ్డి పాల్గొన్నారు. **కలకడ :** శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని దేవళంపేటలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. దేవలంపేట, ఎర్రయ్యగారిపల్లి, కలకడ పురవీధులలో బళ్లారి డప్పులు, మేళ తాళాలు, గిరిగి డ్యాన్సులు మధ్య, బాణాసంచా కాలుస్తూ అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తొగట వీర క్షత్రియులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **పీలేరు :** పట్టణంలోని ఎర్రంరెడ్డి గుట్టలో వెలిసిన శ్రీఅభయ హస్త ఆంజనేయస్వామి దేవస్థానం, స్థానిక సదుం రోడ్డులోని వీరాంజనేయ స్వామి దేవస్థానాల్లో ఆదివారం లోక కళ్యాణార్థం స్వామి వారికి రుద్రాభిషేకం, వడ పూజ, ఆకు పూజ, హెూమం కార్యక్రమాలను నిర్వహించారు. సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు. ఎర్రంరెడ్డి గుట్టలోని అభయ హస్త ఆంజనేయ స్వామి ఆలయం వెలుపల పూజారి ఎన్. అశోక్ కుమార్ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏటి సుజాత దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఏటి వెంకట శివా రెడ్డి, లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, దీపక్, సునీల్, ఆనంద, రాధాకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. **కలికిరి :** స్థానిక మండలంలోని మేడికుర్తి గ్రామపంచాయతీ పడమ ట కురవపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి గుడి నందు ధర్మకర్త బడుకూరి రామలింగయ్య ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఉదయాన్నే అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు భక్తులకు పంచిపెట్టారు. అనంతరం ఉచిత భోజనాలు నిర్వహించి రాత్రి చెక్కభజనలు, కోలాటాలతో భక్తులు పరవశించిపోయారు. మర్రికుంటపల్లి గ్రామపంచాయతీ బయ్యారెడ్డిగారిపల్లి అలియాస్ ఎల్లంపల్లి వద్ద అభయ ఆంజనేయస్వామి గుడి నందు ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు పంచిపెట్టి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామ సమీపాన మట్లి కాలం రాజుల కాలంలో వెలసిన కోట గడ్డ శ్రీ అభయాంజనేయ స్వామికి హనుమాన్ జయంతి సందర్భంగా దేసు నారాయణరెడ్డి, దేసు రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో శివశర్మ పురోహితుల ఆధ్వర్యంలో ఆకుపూజ, అభిషేకం, పడపూజ కార్యక్రమాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులకి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి, వల్లూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి, పోత్తవి హర్షవర్ధన్ రెడ్డి, నారపు రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శ్రీరామరాజు, పవన్ కుమార్ రాజు, ధర్మయ్య, యద్దల మోహన్ మూర్తి, లక్ష్మీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలోని కన్యమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లి బస్‌స్టాప్‌లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం మరిమిరెడ్డిగారిపల్లి, కొత్త కరోపల్లె గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు.



పుల్లంపేట : భోజనాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

అన్నదాతకు తొలకరి ముందస్తు పలకరింపు

- దుక్కులకు అనుకూలించిన వాతావరణం



సేద్యం చేస్తున్న రైతు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది వరుణుడు అన్నదాతను ముందే పలకరించాడు. నిశిరాత్రి వేళ నిండు వర్షం కురవడంతో దుక్కులకు వాతావరణం కూడా అనుకూలించింది. ఈ వేసవి కాలపు దిక్కులు రైతులకు బహుళ ప్రయోజనం కలిగిస్తాయి. సాధారణంగా మే 15 నుంచి రైతులు వ్యవసాయంపై దృష్టి సారిస్తారు. అప్పుడే ఏరువాక సేద్యాలకు రైతులు ఉపక్రమిస్తారు. కానీ ఈ దపా ముందస్తుగా పదును వర్షాలు కురిశాయి. దుక్కులకు వాతావరణం అనుకూలించడంతో రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. ఏడాది పొడవునా సాగు చేసే పంటలకు వేసవి దుక్కులు ఎంతో ఉపయోగపడతాయి. ఖరీఫ్, రబీ రెండు సీజన్లు పూర్తయిన అనంతరం జనవరి లేదా ఫిబ్రవరి నుంచి రైతులు పంట విరామం పాటిస్తారు. తదుపరి సేద్యాల సమయం వచ్చేవరకు వేసవిలో ఎదురు చూస్తారు. తొలకరి లేదా ముంగారి చినుకుల ప్రభావం వేసవి కాలపు దుక్కులపై ఆధారపడి ఉంటాయి. ఉగాది పండుగ అనంతరం మొలకల పౌర్ణమి వస్తుంది. ఇక్కడి నుంచి వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు కూడా వ్యవసాయ పంటలకు మిక్కిలి దోహదపడతాయి. ఈ లోపు కాసిన్ని పదును వర్షాలు కురిస్తే రైతులు దుక్కుల వైపు మొగ్గు చూపుతారు. వీటినే ఏరువాక సేద్యాలు అని కూడా పిలుస్తారు. సేద్యాలు పూర్తి చేసుకున్న అనంతరం రుతుపవనాల వాతావరణ వల్ల వచ్చే పదును వర్షాలు ఖరీఫ్ సీజన్‌లో సాగించే పంటలకు ఉపయోగపడతాయి. భూమి ఉగ్గు రేగిన తర్వాత సేద్యాలకు ఉపక్రమించడం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూమికి ఏటవాలుగా సేద్యం చేయాలి.. తద్వారా భూమి లోపల దాగి ఉండే క్రిములు, కీటకాలు తీవ్రమైన ఎండలకు నశిస్తాయి. దీనివల్ల కలుపు నివారణ సమస్య తగ్గుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అలాగే దుక్కులను లోతుగా చేయాలి.. దీనివల్ల వర్షాభావ పరిస్థితిలో సాగులో ఉన్న పంటలకు కాస్త ఊరట కలుగుతుందని రైతులు చెబుతున్నారు. చేలకు మట్టి చేరవేసిన తర్వాత పదును వర్షాలు వస్తే వివిధ రకాల పంటలు పండించుకునే వెసులుబాటు ఉంటుంది. ముఖ్యంగా రసాయనిక ఎరువుల వినియోగానికి స్వస్తి కలిగి ప్రకృతి వ్యవసాయపు మగ్గు చూపాలని, అలాగే సేంద్రియ ఎరువులను వాడడం వల్ల అటు భూమి సారవంతంగా ఉండడంతోపాటు నాణ్యమైన దిగుబడి చేతికందే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆ దిశగా ఈ ఏడాది రైతులకు ప్రకృతి సహకరించాలని ఆశిద్దాం.

ముస్లిముల అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర గౌరవాధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముస్లిములు విద్య, రాజకీయ పరంగా ముందుండాలనే లక్ష్యంతోనే ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందని రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. ఆదివారం తిరుపతి పట్టణంలోని బాబా జగజీవన్ రామ్ భవనంలో ముస్లిముల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపరంగా ముస్లిములు వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలు అవుతున్నా దేశంలో, రాష్ట్రంలో ముస్లిములు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు కొనసాగించామని చెప్పారు. దేశంలో,రాష్ట్రంలో రాజకీయపరంగా ముస్లిముల దామాషా ప్రకారం అందాల్సిన హక్కులు అందడం లేదని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు ముస్లిములను ఓటు బ్యాంక్‌గానే చేస్తున్నారని విమర్శించారు. ఓట్లు మావే సీట్లు మావే అనే నినాదంతో ముస్లిము ఐక్యవేదిక ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. 2024 ఏడాదికి హజ్‌కి వెళ్లే ప్రయాణికులపై వేరే రాష్ట్రాల కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడాన్ని ఐక్యవేదిక నిల దీసిందని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ పెద్దలతో చర్చించి సమ స్యను పరిష్కరిస్తుందని తెలియజేయడం సంతోషిం చదగ్గ విషయమని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర గౌర వాధ్యక్షులు జియావుల్ రెహమాన్, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాష, రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ వలి, జాయిం ట్ సెక్రటరీ సయ్యద్‌నూర్, అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్, మదనపల్లి అధ్యక్షులు ఫయాజ్, నజీర్, మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సలావుద్దీన్



ఆభరణాల ప్రదర్శనలో ఆకర్షణీయంగా మహిళలు

బ్రైడల్ జ్యువెలరీకి ఆదరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశంలోనే అతిపెద్ద బంగారు వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అత్యంత ప్రజాదరణ పొందిన తమ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచారంలోని 10వ ఎడిషన్‌ను ఇటీవల విడుదల చేసింది. మలబార్ గోల్డ్ మహిళా ఖాతాదారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ తాజా ఎడిషన్‌లో తమ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా క్యాంపెయిన్ ఆధునిక వధువులలో ఒక ట్రెండ్ సెట్టర్‌గా ఉద్భవించిందన్నారు. బ్రైడ్స్‌ఆఫ్ ఇండియా 2023 థీం సాంగ్ షో ది వే విడుదల చేయడం మాకెంతో ఆనందంగా ఉందన్నారు. బ్రైడల్ జ్యువెలరీ ప్రచారానికి అన్ని కోణాల్లో ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ ప్రచార చిత్రంలో తమ బ్రాండ్ అంబాసిడర్‌లు అలియా భట్, అనిల్ కపూర్ మంత్రముగ్ధులను చేసే మలబార్ గోల్డ్ డైమండ్స్ ఆభరణాల ప్రపంచం లోకి తీసుకెళ్తారన్నారు. కడప మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ మేనేజర్ లిసన్ సత్య మాట్లాడుతూ దేశంలోని పలు ప్రాంతాల ఆధునిక తరానికి చెందిన వధువుల అందాన్ని మరింత పెంచేలా ఈ ఆభరణాలు ఉన్నాయన్నారు. నాణ్యతకు మలబార్ గోల్డ్ పెట్టింది పేరన్నారు .వన్ ఇండియా వన్ గోల్డ్ రేట్ పథకం కింద దేశవ్యాప్తంగా ఒకే ధరలలో బంగారు ఆభరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులు ఆసక్తిగా జ్యువలరీ ప్రదర్శనను తిలకించి పులకించి పోయారు. కార్యక్రమంలో మలబార్ గోల్డ్ మార్కెటింగ్ మేనేజర్ ఇషాక్ బాషా, అధిక సంఖ్యలో ఖాతాదారులు, మలబార్ గోల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యం, చరిత్ర రంగాల్లో 'కట్టా' కృషి మరువలేనిది

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో సాహిత్య, చరిత్ర రంగాల్లో విద్వాన్ కట్టా నరసింహులు కృషిని మరువలేమని యోగి వేమన విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం సమన్వయకర్త డాక్టర్ కోట మృత్యుంజయరావు కొనియాడారు. కైఫీయత్తుల పరిష్కర్త, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం తొలి బాధ్యులు కట్టా నరసింహులు రెండవ వర్ధంతిని ఆదివారం కడప నగరంలోని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా మృత్యుంజయరావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన సాహిత్య చరిత్రను వెలికి తీయడంలో కట్టా కృషి మరువలేమన్నారు. అనితర సాధ్యమనిపించే కైఫీయత్తుల పరిష్కారం ద్వారా జిల్లాలోని పలువురు మొన్నటితరం కవులు, వారి రచనలు, ఇతర ముఖ్యమైన ఎన్నో చారిత్రక అంశాలను ఆయన నేటి తరానికి అందించారన్నారు. ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయంతోపాటు ఇతర సాహిత్య కార్యక్రమాలతో అనుబంధం ఏర్పడడానికి విద్వాన్ కట్టానే కారణమన్నారు. రాయలసీమ టూరిజం సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు మాట్లాడుతూ తనకు సాహిత్యంపై మక్కువ కలగడానికి విద్వాన్ కట్టాయే కారణమని, ఆయన ప్రోత్సాహం, శిక్షణతోనే కైఫీయత్తులను నేటి తరానికి అర్థమయ్యేలా పుస్తక రూపం ఇవ్వగలిగామన్నారు. ఆయన తనలాంటి ఎందరో వ్యక్తుల ప్రతిభను గుర్తించి సమాజానికి పరిచయం చేశారన్నారు. కట్టా బహుముఖ ప్రజ్ఞ గురించి ప్రముఖ టూరిజం ఫోటో గ్రాఫర్ గొబ్బూరు కోటేశ్వరరావు, గంగాధర్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విజయ్, నారు నాగరాజు, డేవిడ్, సతీష్ పాల్గొన్నారు.



కట్టా నరసింహులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ ప్రతినిధులు

క్రైం కార్నర్



ప్రమాదానికి గురైన కారు



మృతి చెందిన ప్రధానోపాధ్యాయుడు

టైరు పగిలి చెట్టును ఢీకొన్న కారు

ప్రధానోపాధ్యాయుడు మృతి..నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి-వేంపల్లి ప్రధాన రహదారిలోని మండల పరిధిలోని కుమ్మరిపల్లె పంచాయతీ పరిధిలోని సబ్ స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు టైరు పగిలి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్ఎఫ్ఎం ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మునిస్వామి(59) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోలీసుల కథను మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడిశెట్టి మునిస్వామి రామాపురంకు చెందినవారని ఈయన నల్లగుట్టపల్లి పంచాయతీ బిసికాలనీ లో ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎం ప్రధానో పాధ్యాయుడిగా పనిచేస్తున్నారని తెలిపారు. తన భార్య కూతురు అల్లుడు పిల్లలతో గండి ఆంజనేయస్వామిని దర్శించుకుని కారులో తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యానికి రాగానే కుమ్మరపల్లి సబ్ స్టేషన్ వద్దకు సమీపంలోకి రాగానే కారు టైరు పగిలి చెట్టుకు ఢీకొంది. ఈ సంఘటనలో మునిస్వామి అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలతో ఉన్న లక్ష్మీకాంతమ్మ, శ్రావణి, పిల్లలు బావేష్ సూర్యంలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు నడుతున్న మృతుడి అల్లుడు సత్య నారాయణకు ఎలాంటి గాయాలు కాలేదు. సంఘటన స్థలానికి రామపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. సొంత పనుల మీద ద్విచక్ర వాహనాల్లో వెళ్లుతుండగా గట్టు వద్దకు రాగానే ఎదురుదెరుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకట్రమణ(60), నారాయణమ్మ (55), చంద్రకళ(40) తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రులను హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన వెంకటరమణ